క్లుప్తంగా

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లోని పశువులకు గాలికుంటు టీకాలు బుధవారం వేసినట్లు పశువైద్యాధికారి నాగుల్ మీరా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి పశువుకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరు మాసాలపై బడిన వాటికి టీకాలు వేయించాలని పశుపోషకులకు సూచించారు. టీకాలు ఆవులకు, ఎద్దులకు వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

జూదరుల అరెస్టు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పోలవరం పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. తనకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. జూదరుల నుంచి 8500 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

యర్రగొండపాలెం: మోటార్ బైక్ ఢీకొని వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం మండలంలోని ఎలక చెట్టువద్ద జరిగింది. గురిజేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెన్నా వెంకటేశ్వరరెడ్డి(41) సొంత పనుల నిమిత్తం మోటార్ బైక్‌పై యర్రగొండపాలెం వెళుతుండగా ఫోన్ రావడంతో రోడ్డు పక్కన బైక్ ఆపి మాట్లాడుతున్నాడు. ఈ సమయంలో బిక్షాలు అనే వ్యక్తి మద్యం సేవించి మోటారు బైక్‌పై బోయలపల్లి నుంచి త్రిపురాంతకం మండలంలోని మిట్టపాలెం వెళుతూ రోడ్డు పక్కన నిలబడి ఉన్న వెంకటేశ్వరరెడ్డిని ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆయన కాలుకు తీవ్రంగా గాయమైంది. వెంటనే క్షతగాత్రున్ని స్థానికంగా ప్రైవేట్ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పల్నాడు జిల్లా నరసరావుపేటకు తరలించగా..అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

భూసార పరీక్షల తర్వాతే ఎరువులు వాడాలి

మార్కాపురం టౌన్: రైతులు తమ పొలాలకు సంబంధించి భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడాలని సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఏడీఏ సుచరిత తెలిపారు. బుధవారం మండలంలోని కొండేపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో ఆమె వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులుతో కలిసి పర్యటించారు. భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులు వాడితే పెట్టుబడి వ్యయం తగ్గుతుందని, పంటకు సక్రమంగా ఎరువులు అందుతాయన్నారు. ఏఓ శ్రీనివాసులు మాట్లాడుతూ సబ్సిడీపై డ్రిప్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మే నెలలో రైతులు తమ పొలాల్లో లోతు దుక్కులు చేసుకోవాలని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. డీఆర్‌సీ ఏఓ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

వలస బాట పట్టిన పశువులు



వలసబాట పట్టిన ఆవులు



ఎడ్ల బండిలో నివాస సామగ్రి

- గుక్కెడు నీరు.. పిడికెడు మేత కోసం పాట్లు
- ఆదుకునే వాడు లేక అలమటిస్తున్న మూగజీవాలు
- తండాలను ఖాళీ చేస్తున్న పశుపోషకులు

కురిచేడు:

ఇంకా ఎండాకాలం ఆరంభం కాలేదు. మార్చి నెల నిండలేదు. పశ్చిమ ప్రాంత ప్రజలకు కన్నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. బతుకు బండి కదిలింది.. గొడ్డూ గోద, పిల్లాపాపలతో సహా ఇళ్లకు తాళాలు వేసి రోడ్డు పట్టారు. వెలుగొండ ప్రాజెక్టుకు పునాది పడి సిల్వర్ జూబ్లీ జరుపుకుంటోంది. కానీ పశ్చిమ ప్రాంత ప్రజల గొంతు లోకి చుక్కకూడా దిగడం లేదు. ప్రభుత్వం మంచినీరు ఇవ్వలేక పోయినా మద్యం మాత్రం పుష్కలంగా అందిస్తోంది. వెలుగొండ పూర్తయితే పంటలకు రాకపోయినా కనీసం భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావులు రీచార్జి అవుతాయి. తద్వారా తాగు నీటి కష్టాలు తీరుతాయని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న పశ్చిమప్రాంత ప్రజలకు ఎండమావులే దిక్కయ్యాయి. జిల్లాలోని చివరి పుల్లలచెరువు మండలం పుల్లలచెరువు తండా నుంచి సుమారు 1000 ఆవులతో 10 కుటుంబాలు వలసబాట పట్టాయి. బుధవారం అవి కురిచేడు చేరుకున్నాయి. నాలుగు రోజుల క్రితం ఇంటి వద్ద బయల్దేరిన ఆవులమందలు, ఆయా కుటుంబాల వారు ఇప్పటికి కురిచేడు చేరారు. వారిని ‘సాక్షి’ పలకరించింది. గంపడంత సంసారం గంపలో పెట్టుకుని కన్నీటి కష్టాలు వెలిబుచ్చారు.

తొలకరి వరకు తొంగి చూసేది లేదు

మార్చి నెలలో ప్రారంభమైన వలసలు వెళ్తూ ఎక్కడ నీరు కనిపిస్తే అక్కడ, ఎక్కడ మేత కనిపిస్తే అక్కడ బస చేసుకుంటూ రాత్రి, పగలు, ఎండా వాన తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడే ఉంటూ తమ మూగ సంపదను కాపాడుకునేందుకు తండా వాసులు తంటాలు పడుతున్నారు. దర్శి మీదుగా బాపట్ల జిల్లా రేపల్లె, కృష్ణానది ఒడ్డుకు చేరి తమ పశు సంపదను కాపాడుకుంటామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం మేత, తాగునీరు సరఫరా చేసి ఉంటే వలసబాట పట్టేవారం కాదని, ఇంకా వలస వచ్చే సంఖ్య చాలా ఉందని పేర్కొన్నారు.

బండెడంత సంసారాలు బండిలో..

బండెడంత సంస్కారాలు బండిలో పెట్టుకుని వలసకు బయల్దేరారు. పూర్వకాలంలో ఇలాంటి పరిస్థితి కనిపించేదు. ఆధునిక యుగమని చెప్పుకుంటూ, అభివృద్ధి మంత్రం వల్లెవేస్తున్న తరుణంలో కూడా వలసలు జరగటం అభివృద్ధిని ప్రశ్నిస్తోంది. ఏసీ గదుల్లో కూర్చుని కేవలం కాగితాలపై అభివృద్ధిని చూపిస్తే వాస్తవాలు రోడ్డున పడక తప్పదని చూసిన వారు విమర్శిస్తున్నారు. మహిళలు, చిన్నారులు తినేందుకు అవసరమైన సరుకులు, వంటపాత్రలు బండిలో వేసుకుని ఆవుల వెనకాల ఎడ్ల బండితో పయనమయ్యారు. నడవలేని లేగ దూడలను బండిలో ఎక్కించుకుని వెళ్తామని, వారికి చెట్ల నీడే ఆధారమని కన్నీటి పర్యంతమయ్యారు. అయిన వారిని, ఉన్న ఊరిని వదిలి వెళ్లటం బాధగా ఉన్నా తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలంలో ఇలాంటి పరిస్థితులను చూడటం అమానవీయమని మేధావులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు ఏసీ గదులు వదిలి వాస్తవాలు చూసి ప్రజలకు సహకారం అందించాలని, మూగజీవాల పాపం మూటకట్టుకోవద్దని ప్రజలు కోరుతున్నారు.

గుక్కెడు నీరులేదు:



బోర్లు,బావులు ఎండిపోయాయి. గొంతు తడుపుకుందామన్నా ఎక్కడా గుక్కెడు నీరు దొరకడం లేదు. మాకే నీరు లేదు.. ఇంక పశువులకు నీరు, మేత కష్టమైంది. పట్టించుకునే వారు లేరు. ఇక్కడే ఉండి బతక లేక బతుకుజీవుడా..అని వెళ్తున్నాం. గుప్పెడు మేత, గుక్కెడు నీరు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లడమే మా పని.

బాణావత్ సోమిబాయి, పుల్లలచెరువు తండా

వానొస్తేనే ఊరొచ్చేది:



తొలకరి వానలు వచ్చాయని తెలిస్తేనే మళ్లీ ఆవులను తోలుకుని వెళ్లిన దారిలో తిరిగివస్తాం. అప్పటి వరకు ఎక్కడ నీరు, మేత కనిపిస్తే అక్కడే మా బతుకులు. మాకు ఉన్న సంపద ఆవులు, పొలాలు. పంటలు అయిపోయాయి. ఆవులకు మేత, నీరు లేకపోవడంతో వలస పోవాల్సి వచ్చింది. వాటిని కాపాడుకోవడమే మాకు ముఖ్యం.

బాణావత్ తులసిబాయి, పుల్లలచెరువు తండా

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



సుబ్బయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి (కురిచేడు): మున్సిపాలిటీ పరిధిలోని శివరాజ నగర్‌కు చెందిన పుట్టా సుబ్బయ్య (46) అంత్యక్రియల కోసం ఆయన కుటంబ సభ్యులకు దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. సుబ్బయ్య అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. గ్రామ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బూచేపల్లి వెంటనే స్పందించి తమ ట్రస్టు ద్వారా అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మృతుని భార్య మరియమ్మకు అందజేశారు. మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, దొంత ఏడుకొండలు, తన్నీరు అంకమరావు, కరిపిరెడ్డి రమణారెడ్డి, కవలకుంట్ల లాజరు, శ్రీరామ్ గురవయ్య పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్‌పై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతురావు

తాళ్లూరు: మహిళా దినోత్సవం సందర్భంగా అర్హత ఉన్న మహిళలకు 90 రోజులు కుట్టుమిషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించి కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు ఎంపీడీవో దారా హనుమంతురావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆదరణ–3 పథకం ద్వారా కులవృత్తి సంఘాల నాయకులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులకు నాణ్యమైన పనిముట్లు అందించనున్నట్లు తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన మహిళలు తమ పేర్లను సచివాలయాల్లో ఏపీపీ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏవో సత్యం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

- 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పనుకుమడుగు గూడెం పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్, పోలీస్, ఫారెస్ట్ అధికారులు బుధవారం విస్తృత దాడులు నిర్వహించారు. దాడుల్లో భారీగా నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి వినియోగించే డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటరెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని పనుకుమడుగు పరిసర ప్రాంతాల సమీపంలో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి వినియోగించే డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

జాగ్రత్తలతో అధిక దిగుబడులు



తాళ్లూరు: మాట్లాడుతున్న ఏవో ప్రసాద్‌రావు



పుల్లలచెరువు: రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి

పుల్లలచెరువు: కాలువ ఏరియా పరిధిలో రైతులు సాగు చేసిన మినుము పంటలో తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని మానేపల్లి, ఐటీవరం గ్రామాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ప్రస్తుతం కాలువ ఏరియా పరిధిలో సాగు చేసిన మినుము పంటలో రసం పీల్చు పురుగు ఎక్కువగా కనిపిస్తోందని, దాని నివారణకు ఎసిఫేట్ గ్రామును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. వీఏఏలు వసంతరెడ్డి, కొండానాయక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు: సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందని, గ్రామీణ మహిళలు వ్యవసాయంలో కూడా రాణిస్తున్నారని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. నాగంబట్లపాలెం, తూర్పుగంగవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మహిళా సంఘాల ద్వారా పెరటి తోటల్లో పెంపకంతో పాటు వ్యవసాయంలో విత్తు నుంచి విక్రయం వరకు ప్రతి పనిలో కీలకమన్నారు. వీఏఏలు పి.దయాసాగర్, వెంకటసుమ, వీవో సభ్యురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.



ముండ్లమూరు: సస్యరక్షణ గురించి వివరిస్తున్న ఏఓ ఫరూక్

ముండ్లమూరు (కురిచేడు): మినుము, పెసర పంటలు సాగు చేసిన రైతులు పంట యామాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఫరూక్ తెలిపారు. మండలంలోని వేముల, వేములబండ గ్రామాల్లో సాగు చేసిన మినుము, పెసర పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. పెసర, మినుము పంటలు పూత, కల్లె దశలో ఉన్నాయని, వాటికి ఎకరానికి కేజీ 19.19.19 లేదా 13.0.45 ఎరువును పైపాటుగా పిచికారీ చేస్తే పూత, పిందె కాయలుగా మారుతాయన్నారు. పంటలలో ఆశించే పురుగులు, తెగుళ్లను గుర్తించడం కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా సస్యరక్షణ చర్యలు తెలుకోవచ్చని, యాప్ వాడే విధానం గురించి ఆయన వివరించారు. వేముల సర్పంచ్ గజ్జెల ఆదెమ్మ, సుబ్బారెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రుద్రసముద్రంలో బెల్ట్‌షాప్‌పై దాడి



స్వాధీనం చేసుకున్న మద్యం కేసులు

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌పై బుధవారం సాయంత్రం ఎస్‌ఐ టి.త్యాగరాజు తన సిబ్బందితో దాడి చేశారు. 368 మద్యం బాటిళ్లు, 49 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ త్యాగరాజు మాట్లాడుతూ పెద్దారవీడు మండలం బద్వేడు గ్రామానికి చెందిన శెట్టిబత్తిన కాశయ్య ఇతర ప్రాంతాల్లోని మద్యం బాటిళ్లను ఆటోలో తీసుకొచ్చి రుద్రసముద్రంలో బెల్ట్ షాపులకు అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న తాను గ్రామంలోని బెల్ట్ షాప్‌లో ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కాశయ్యపై కేసు నమోదు చేసి దర్శి సబ్ కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్‌ఐ త్యాగరాజు పేర్కొన్నారు.

తూర్పుగంగవరం వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మస్తాన్‌వలి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలిని ప్రపంచ సంస్కృతి మరియు పర్యావరణ పరిరక్షణ కమిషన్ జాతీయ సభ్యుడిగా కేంద్రం నియమించింది. దక్కన్ క్లాత్ పెయింటింగ్ కార్ట్స్ వాటర్ ప్రూఫ్ రంగంలో మస్తాన్‌వలి ఫైనల్ విజేతగా నిలిచారు. ఇందుకుగాను బుధవారం ఢిల్లీ వేదికగా వరల్డ్ కల్చరల్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ క్యాటగిరిలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉన్నత ఆలోచనతో సర్వీసు అందిస్తున్న మస్తాన్‌వలికి దేశ ప్రధాని అభినందనలు తెలిపారు.

పొగాకు షెడ్డు దగ్ధం



పొలంలో కాలి బూడిదైన పొగాకు, షెడ్డు

పెద్దారవీడు: మండలంలోని బద్వీడుచెర్లోపల్లిలో పొలంలో వేసిన పొగాకు షెడ్డు బుధవారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతు మూల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్నం వరకు పొలంలో పనులు చేసుకుంటూ ఉన్నామని, భోజనానికి ఇంటికి వెళ్లినట్లు చెప్పాడు. మూడు గంటల సమయంలో ఏం జరిగిందో తెలియదుగానీ మంటలతో పొగాకు కాలిపోతోంది. షెడ్డులో ఉన్న కర్రలు, ప్లాస్టిక్ కవర్లు, నిల్వ ఉన్న పొగాకు కాలి బూడిదైంది. మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించకుండా స్థానికులు అదుపు చేసేందుకు ప్రయత్నం చేసినా వ్యాపిస్తూనే ఉన్నాయి. మార్కాపురం నుంచి అగ్నిమాపక వాహనంతో సిబ్బంది దోర్నాల వెళ్తున్నారు. అదే సమయంలో వెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. దీంతో మిగిలిన పొగాకు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం షెడ్డులో తాడుతో నల్లబార్లు పొగాకు అల్లిన తర్వాత ప్లాస్టిక్ సీట్ చుట్టి కర్రలు, కర్రలకు కట్టిన పొగాకు దాదాపు 9 క్వింటాళ్లు, ఎండాకు 10 క్వింటాళ్లు కాలి బూడిదైంది. ఎండు పొగాకు క్వింటా రూ.15 వేలు, నల్లబారు పొగాకు క్వింటా రూ.18 వేలు ధర పలుకుతోందని, పొలంలో ఉన్న రెండు రకాలకు చెందిన పొగాకు విలువ దాదాపు రూ.3.50 లక్షల విలువ ఉంటుందని బాధితుడు తెలిపాడు. చేతికి వచ్చి అమ్మేందుకు సిద్ధంగా ఉన్న పొగాకు కాలిపోవడంతో పెట్టుబడికి తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలిబూడిదైన పొగాకుకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి అందుకోవాలని రైతు శ్రీనివాసరెడ్డి కోరుతున్నాడు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు



చెన్నయ్య మృతదేహం



గాయపడిన సురేష్

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని ఉల్లగల్లు పెట్రోలు బంకు ఎదుట రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. శివకోటిరెడ్డి, చెన్నయ్య (45)లు ఒక బైక్‌పై అద్దంకి వెళ్తున్నారు. ఉల్లగల్లు నుంచి జిల్లెలమూడి సురేష్ తన ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్తున్నాడు. ఉల్లగల్లులోని పెట్రోలు బంకు వద్దకు వచ్చే సరికి రెండు ద్విచక్ర వాహనాలూ బలంగా ఢీకొట్టుకున్నాయి. రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న ముగ్గురికి బలమైన గాయాలయ్యాయి. 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వారిలో శివకోటిరెడ్డి, సురేషలను మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించాలని సూచించారు. చెన్నయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెన్నయ్యది పొదిలి మండలం ఉన్న గురవాయపాలెం.